23112023-DIS-13_Layout 1 11/23/2023 2:46 AM Page 1



# కాంగ్రెస్ భూ తంత్రం

## ధరణిపై కాంగ్రెస్ దుష్ప్రచారం వెనుక పెద్ద పన్నాగం

# ధరణిపై కుతంత్రం

- విలువైన భూములను బెంగళూరు ముఠాకు కట్టబెట్టే కుట్ర
- ధరణి పోర్టల్‌తో భూముల రికార్డులన్నీ సురక్షితం
- రైతుకు తెలియకుండా రికార్డులు మార్చడం అసాధ్యం
- దోపిడీకి అడ్డుగా ఉన్న ధరణిని ఎత్తేసేందుకు ప్లాన్
- పోర్టల్‌ను భూతంగా చూపెట్టేలా అభూత కల్పనలు
- భూములను ఆక్రమించారంటూ గోబెల్స్ ప్రచారం
- ఒక్క ఆధారం కూడా బయటపెట్టని కాంగ్రెస్ నేతలు
- మళ్లీ రాత పద్ధతి తెచ్చి భూములు గుంజుకోవాలని పన్నాగం

### కాంగ్రెస్‌కు ఓటేస్తే ఏమైతది?

- పారదర్శకంగా, రైతులకు సౌలభ్యంగా ఉన్న ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తారు.
- ధరణిని రద్దు చేసి మళ్లీ పాత పద్ధతిలో చేతిరాత రికార్డుల విధానం తీసుకొస్తారు.
- ఇష్టానుసారం భూరికార్డులు మార్చేస్తారు. భూ దందాలు, సెటిల్మెంట్లకు తెరలేపుతారు.
- భూ యజమానికి తెలియకుండానే రాత్రికి రాత్రే రికార్డులను తారుమారు చేస్తారు.
- రైతుల భూములకు భద్రతలేకుండా చేస్తారు. చిన్న, సన్నకారు రైతుల జీవితాలతో ఆటలాడుకుంటారు.
- రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాల్లో పైరవీకారుల, దళారుల జోక్యం మొదలవుతుంది.
- బీమా పరిహారం క్లయిమ్ చేసుకోవాలంటే రకరకాల సర్టిఫికెట్ల కోసం ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తుంది.
- ధరణి రద్దుతో ఎన్నారైల భూములకు రక్షణ లేకుండా పోతుంది. వారి భూములను కొల్లగొట్టేందుకు కబ్జాకోరులు ప్రయత్నిస్తారు.




హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): 'సీఎం కేసీఆర్ గజ్వేల్ ప్రాంత రైతుల నుంచి వేల ఎకరాలను గుంజుకున్నడు. హైదరాబాద్ నగరం చుట్టూ 10 వేల ఎకరాలను ఆక్రమించుకున్నడు. గజ్వేల్‌లో సీఎం కేసీఆర్, ఆయన సుట్టపోళ్లు మొత్తం ఊడ్చేశారు. పేదల భూములను కబ్జా చేశారు. ఇప్పుడు కామారెడ్డిలో రూ.2 వేల కోట్ల భూములు గుంజుకునేందుకు కుట్ర చేస్తున్నారు' – పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేస్తున్న విష ప్రచారం ఇది.

### ఏం జరుగుతున్నది?

కొందరు దొంగలు ఒక బ్యాంకులో దొంగతనం చేయాలని ప్లాన్ చేశారు. కానీ.. దానికి 24 గంటలు ఒక కుక్క కాపలాగా ఉన్నది. అది ఉండగా బ్యాంకులోకి కాలు పెట్టడం సాధ్యం కాదని వారికి అర్థమైంది. దాని అడ్డు తొలగించుకోవడానికి ఓ పన్నాగం పన్నారు. అది పిచ్చి కుక్క అనే ప్రచారం మొదలుపెట్టారు. ఆ కాలనీవాసులు దొంగల మాటలు నమ్మి ఆ కుక్కను కాలనీ నుంచి తరిమి కొట్టారు. మరునాడే బ్యాంకులో దొంగలు పడి మొత్తం సంపదను దోచుకుపోయారు. కాలనీవాసులు దాచుకున్న సొమ్ము మొత్తం దొంగలపాలైంది.

ఇప్పుడు ధరణి పోర్టల్ విషయంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానం ఇలాగే ఉన్నది. కుట్రపూరితంగా పోర్టల్‌పై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నది. నిజానికి రాష్ట్రంలోని రూ.లక్షల కోట్ల విలువైన భూములపై కాంగ్రెస్ నేతలు కన్నేశారు. ధరణి పోర్టల్ ఉండగా భూములను గుంజుకోవడం సాధ్యం కాదని వారికి తెలుసు. అందుకే 'ఒక కుక్కను చంపే ముందు దానిపై పిచ్చిదనే ముద్ర వేయాలి' అనే నానుడిని అనుసరిస్తూ ధరణిపై రెండు రకాల దుష్ప్రచారాలు చేస్తున్నారు. వీటిలో ఒకటి ధరణి పోర్టల్ మంచిది కాదని చెప్పడం. రెండోది బీఆర్ఎస్ నాయకులు భూములను ఆక్రమించారని ప్రచారం చేయడం. ఈ విషప్రచారంలో భాగంగానే సీఎం కేసీఆర్ భూములను గుంజుకున్నారంటూ పదే పదే చెప్తూ.. చెప్పిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఒకవేళ అధికారంలోకి రాగానే ధరణిని ఎత్తివేసినా ప్రజలు అడ్డుకోకుండా ముందస్తుగా దానిపై విషబీజాలు నాటే ప్రయత్నం చేస్తున్నారు.

### ఎందుకీ దుష్ప్రచారం?

ధరణిపై కాంగ్రెస్ నేతల దుష్ప్రచారానికి స్పష్టమైన కారణం ఉన్నది. గతంలో రాష్ట్రంలో జరుగుతున్న నేరాల్లో 60% భూమి చుట్టూనే ఉండేవి. పొలం పనులు చేసుకోవాల్సిన రైతులు.. గొడవలు, కొట్లాటలు, పంచాయితీలు, కోర్టు కేసులు అంటూ తిరిగేవారు. పట్టాల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతూ లంచాలు ముట్టజెప్పేవారు. ఈ దుర్మార్గాలను నిలువరించే విధంగా, రైతుల భూములు కాపాడేవిధంగా పక్కా వ్యవస్థను రూపొందించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారు. ముందుగా రికార్డుల ప్రక్షాళన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 2.55 కోట్ల ఎకరాల భూ రికార్డులను అధికారులు పరిశీలించి, ప్రతి ఖాతాలోని భూముల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైతుల సమక్షంలోనే తుది జాబితాను ప్రదర్శించారు. అభ్యంతరాలు స్వీకరించి, పరిష్కరించారు. ఆ తర్వాతే భూముల సమగ్ర వివరాలను డిజిటలైజ్ చేశారు. ఆ వివరాలతోనే ధరణి పోర్టల్ రూపుదిద్దుకున్నది. ఈ పోర్టల్‌లో ఉన్న నిబంధనల ప్రకారం ఇతరుల భూములను బలవంతంగా గుంజుకోవడం అసాధ్యం. ధరణిలో రెండే రకాల భూములు ఉన్నాయి. మొదటగా.. ప్రభుత్వ భూములన్నీ 'నిషేధిత' జాబితాలో ఉన్నాయి. వాటిని ఆక్రమించి, పట్టాలు చేసుకోవడం అసాధ్యం. రెండోది.. రైతుల భూములు. వీటి హక్కులు మారాలంటే.. అమ్మేవారు, కొనేవారి ఆధార్ వివరాలు, వేలిముద్రలు, ఐరిస్ లేకుండా సాధ్యం కాదు. అంటే ఇద్దరూ కలిసి సాక్షులను తీసుకొని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయాలి. అప్పుడే హక్కులు మారుతాయి. దీనిని బట్టే ప్రతిపక్షాల విమర్శల్లో ఏమాత్రం పస లేదని అర్థమవతున్నది.

### ధరణిపై ఎందుకింత అక్కసు?

ఉమ్మడి రాష్ట్రంలో భూరికార్డుల నిర్వహణ పూర్తిగా రాత పద్ధతిలో ఉండేది. ఆ రోజుల్లో కాంగ్రెస్ నేతలదే ఇష్టారాజ్యం. చోటా, మోటా లీడర్ల నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకు భూదందాలు సాగించేవారు. పెద్ద నేతలు తమ పరపతిని ఉపయోగించి భూరికార్డుల్లో రైతుల పేర్లను రాత్రికి రాత్రే మార్చేసేవారు. ఎకరాలకు ఎకరాల భూములను తమ పేర్ల మీదికి బదలాయించుకునేవారు. ప్రభుత్వ భూములను స్వాహా చేసేవారు. అటవీభూములను గుటకాహస్వాహా అనేవారు. ఇలా వందల ఎకరాలను కబలించేవారు. ఒక్క రాష్ట్ర స్థాయి నేతలే కాదు.. మండల, జిల్లా స్థాయి నేతలదీ అదే తీరు. అదే దోపిడీ. గ్రామస్థాయిలోని నేతలు, గల్లీ లీడర్లు అధికారులతో కుమ్మక్కయ్యి.. కావాలనే రైతుల భూముల పేర్లను మార్చేవారు. రికార్డుల్లో తమ పేర్లు మారిన విషయాన్ని రైతులు గుర్తించగానే మళ్లీ ఆ నేతలే పైరవీకారుల అవతారం ఎత్తేవారు. భూమిని మళ్లీ తమ పేరు మీదికి మార్పిస్తామంటూ నమ్మబలికి 'సెటిల్మెంట్లు' చేసేవారు. ఆ భూమిలో కొంత వాటా తీసుకొని మిగిలింది తిరిగి పట్టా చేయించేవారు. లేదంటే రైతుల నుంచి వేలకు వేలు డబ్బులు వసూలు చేసేవారు. ఇలా ప్రతి గ్రామంలో కనీసం ఐదారుగురు కాంగ్రెస్ నేతలు, పైరవీకారులుగా చెలామణీ అయ్యేవారు.

### ఒకసారి నిజానిజాలు పరిశీలిస్తే..

ప్రస్తుత పరిస్థితుల్లో ఒకరి భూమిని బలవంతంగా గుంజుకోవడం సాధ్యమేనా? తెలంగాణలో గుంట భూమి కోసం తలకాయలు పగలగొట్టుకున్న సందర్భాలున్నాయి. భూమిపై ఇక్కడి ప్రజలకు ఉన్న ప్రేమ అలాంటిది. ప్రస్తుతం పెరిగిన ధరలతో పోల్చుకుంటే.. ఎవరైనా భూములను గుంజుకుంటే చూస్తూ ఊరుకుంటారా? కాంగ్రెస్ ఆరోపణలు నిజమైతే అలాంటి ఘటనలు ఏమైనా జరిగాయా? చిన్నచిన్న విషయాలనే సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న ఈరోజుల్లో ఎవరైనా భూమిని గుంజుకుంటే ఆ విషయం బయటికి రాకుండా ఆపగలగడం సాధ్యమా? మరి సీఎం కేసీఆర్‌గానీ, ఆయన బంధువులుగానీ తమ భూములను బలవంతంగా గుంజుకున్నారని సోషల్ మీడియాలో ఎన్నడైనా ప్రచారం జరిగిందా? ఆడియోనో, వీడియోనో బయటికి వచ్చిందా? ఒకవేళ ఎవరైనా భూములను బలవంతంగా గుంజుకున్నా.. వాటిపై హక్కులు రావడం సులభం కాదు. ధరణి నిబంధనల ప్రకారం అమ్మే వ్యక్తి, కొనే వ్యక్తి స్వయంగా తహసీల్దార్ కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. అక్కడ ఆధార్ వివరాలతోపాటు ఇద్దరి వేలి ముద్రలు, ఐరిస్ వంటివి నమోదు చేయాల్సి ఉంటుంది. కాళేశ్వరం నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్లు, నోటీసులు ఇచ్చి, చట్టప్రకారం పరిహారం చెల్లించి భూ సేకరణ చేపడితేనే కోర్టుల్లో వందల కేసులు పడ్డాయి. ధర్నాలు, రాస్తారోకోలు జరిగాయి. మరి.. సీఎం కేసీఆర్‌గానీ, ఆయన బంధువులుగానీ వేలాది ఎకరాలను ఆక్రమిస్తే ఈ లెక్కన ఎన్నికేసులు పడాలి? ఎన్నెన్ని రాస్తారోకోలు, ధర్నాలు జరగాలి? అలాంటి ఘటనలు ఏమైనా నమోదయ్యాయా?

### 'బెంగళూరు'కు భూములు అప్పజెప్పే కుట్ర

కాంగ్రెస్ పార్టీ ధరణిపై, సీఎం కేసీఆర్‌పై, బీఆర్ఎస్‌పై చేస్తున్న ఆరోపణల వెనుక అసలు కుట్ర వేరే ఉన్నదన్నది బీఆర్ఎస్ నేతల మాట. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు బెంగళూరు నుంచి అడ్డగోలుగా డబ్బులు పంపుతున్నారనే ఆరోపణలున్నాయి. అధికారంలోకి రాగానే ఆ ముఠాకు తిరిగి వడ్డీతో సహా ముట్టజెప్పాల్సి ఉంటుంది. పైగా ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల కోసం, సార్వత్రిక ఎన్నికల కోసం ఢిల్లీకి డబ్బులు పంపాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న పారదర్శక వ్యవస్థలతో ఇంత మొత్తంలో సంపాదించడం అసాధ్యం. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నేతల ప్రధాన సంపాదన మార్గాలు.. పథకాల్లో వాటాలు, భూముల ఆక్రమణలు, సెటిల్మెంట్లు. రూ.200 పెన్షన్‌లో కూడా కమీషన్ తీసుకున్న కాలం అది. తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ మొదలు అన్ని రకాల పథకాలను డైరెక్ట్ బెనిఫిషియరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పద్ధతిలో నిర్వహిస్తున్నది. ప్రతి పైసా నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలోనే పడుతున్నాయి. దీంతో ఆయా పథకాల్లో తమకు వాటా వచ్చే పరిస్థితి లేదు. ధరణితో భూముల ఆక్రమణలకు, సెటిల్మెంట్లకు చెక్ పడింది. ఈ నేపథ్యంలో డీబీటీని ఎత్తివేయడం సాధ్యం కాదు. ఇక మిగిలింది భూములు. ప్రస్తుతం పెరిగిన ధరలతో అత్యంత వేగంగా సంపాదించగలిగే మార్గం కూడా భూములే. అయితే వారి దోపిడీకి, భూదందాలకు ధరణి అడ్డంకిగా తయారైంది. అందుకే.. ధరణిని పెద్ద భూతంగా చూపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. చిన్నచిన్న సమస్యలను భూతద్దంలో చూపెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. విష ప్రచారం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే దానిని ఎత్తేస్తామంటూ ఊదరగొడుతున్నారు. ఒకవేళ పొరపాటున కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ధరణి పోర్టల్‌ను తీసేసినా ప్రజల్లో వ్యతిరేకత రాకుండా చూసుకునేందుకు ఇప్పటినుంచే దానిపై విషప్రచారాలు మొదలుపెట్టారు. అప్పుడు మళ్లీ రాత పద్ధతి, పాత వ్యవస్థను తీసుకొచ్చి ఇష్టారాజ్యంగా భూములను ఆక్రమించవచ్చని కాంగ్రెస్ నేతల పన్నాగం. ఆ దుర్బుద్ధిలో భాగమే ధరణిపై అసత్య ఆరోపణలు. సీఎం కేసీఆర్ అమాయకుల భూములను ఆక్రమించారంటూ దుష్ప్రచారం.

**ధరణిని రద్దు చేస్తే.. రైతు బతుకు ధ్వంసమే!**

అన్నదాతల సమస్యలను తరిమికొట్టడమే కాకుండా మళ్లీ ఆనాటి కష్ట, నష్టాల బారిన పడకుండా ధరణి పోర్టల్ కాపాడుతున్నది. ఈ సౌలభ్యాన్ని రైతుల నుంచి దూరం చేయాలన్నది కాంగ్రెస్ కుతంత్రం. పైరవీకారులను పక్కనబెట్టిన పోర్టల్‌ను పీకేయాలని కాంగ్రెస్ తహతహలాడుతున్నది.




### ధరణితో కలిగిన మేలేమిటి?

ఇప్పుడు ధరణితో రైతుల వివరాలన్నీ ఒకేచోటికి చేరాయి. రకరకాల చేతి రాత పుస్తకాలతో పనిలేదు. అన్ని వివరాలు ఆన్‌లైన్‌లోకి ఎక్కాయి. ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా తమ రికార్డులను ఆన్‌లైన్‌లోనే చెక్ చేసుకోవచ్చు. భూములు అమ్మినా, కొనుగోలు చేసినా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ వెంటనే పూర్తవుతున్నాయి. పట్టాతోపాటు హక్కు మార్పిడి వెనువెంటనే జరిగిపోతున్నాయి. ఒక్కసారి లావాదేవీ పూర్తయితే ఇక ఆ రికార్డులను ఇష్టారాజ్యంగా మార్చడం అసాధ్యం. దీంతో ప్రభుత్వాలకు రైతులను గుర్తించడం చాలా సులభం అయ్యింది. అందుకే సీఎం కేసీఆర్ వెంటనే రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను ప్రవేశపెట్టారు. పండించిన పంటను ముందస్తుగా అంచనా వేసి ప్రభుత్వం గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు తెరిచి ప్రతి గింజను కొనుగోలు చేస్తున్నది.

### ధరణిని తీసేస్తే ఏమైతది?

ఒకవేళ కాంగ్రెస్ నాయకులు చెప్పినట్టుగా ధరణిని తీసేస్తే.. రైతు తన ఉనికిని కోల్పోతాడు. పాత, రాత రికార్డులు ముందుకొస్తాయి. మళ్లీ వీఆర్వో, ఇతర అధికార వ్యవస్థ వస్తుంది. ఒకే భూమికి రిజిస్ట్రేషన్ పత్రాల్లో ఒకరు, రెవెన్యూ రికార్డుల్లో మరొకరు, డబుల్, ట్రిపుల్ రిజిస్ట్రేషన్లతో మరో ఇద్దరు, ముగ్గురు యజమానులు వస్తారు. అసలు రైతు ఎవరో ఎవరికీ తెలియదు. పంట వేసిన ప్రతిసారీ 'సార్.. నేనే నిజమైన రైతును. సర్టిఫికెట్ ఇవ్వండి' అని అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. తాము అధికారంలోకి వస్తే రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్తున్నారు. మరి ఆ డబ్బులు ఎవరికి ఇస్తారు? రిజిస్ట్రేషన్ పేపర్లు ఉన్నవాళ్లకా? రెవెన్యూ రికార్డుల్లోని పాత యజమానులకా? డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన దొంగలకా? ట్రిపుల్ రిజిస్ట్రేషన్లు చేసుకున్న అక్రమార్కులకా? అనే ప్రశ్నకు సమాధానం లేదు. రైతుబంధు అందుకుంటున్నవారిలో 91% మంది సన్న, చిన్నకారు రైతులే. రైతుబంధు ఆగిపోతే వందకు 91 మంది రైతుల బతుకులు ఆగమైపోతాయి.

### వ్యవసాయం ఆగమాగం

ఒకప్పుడు రాష్ట్రంలో ఎరువుల పంపిణీ అధ్వానంగా ఉండేది. అర్ధరాత్రి నుంచే లైన్లలో నిలబడటం, ఎర్రటి ఎండలో ఎదురు చూపులు, చెప్పులు, పుస్తకాలు లైన్లలో ఉంచడం, ఎరువులను పోలీస్‌స్టేషన్లలో ఉంచడం, లాఠీచార్జీలు.. ఆ రోజులు తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. రాష్ట్రంలో రైతులు ఎంతమంది? ఎంత విస్తీర్ణం? ఏయే పంటలు వేస్తున్నారు? వంటి కచ్చితమైన వివరాలేమీ ప్రభుత్వం దగ్గర లేకపోవడం వల్లే ఈ దుస్థితి. ఇక పంట అమ్ముకోవాలంటే బీట్ల వరకు పరిగెత్తాల్సిందే. రోజులపాటు ధాన్యం కుప్పల మీద గడపాల్సిందే. ఇప్పుడు, ధరణి పోర్టల్‌తో రైతుల వివరాలన్ని కచ్చితంగా ఉండటం, ఏఈవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండటంతో ఎరువుల లెక్కలు ఖచ్చితంగా ఉన్నాయి. దీంతో ప్రభుత్వం ముందస్తుగానే స్టాక్ పెడుతున్నది. ఎరువుల పంపిణీ ప్రశాంతంగా సాగుతున్నది. పంట కొనుగోళ్ల ప్రక్రియ సులభతరం అయ్యింది. ధరణిని ఎత్తేస్తే.. మళ్లీ రైతులు పాస్‌పుస్తకాలు, చెప్పులు లైన్‌లో ఉంచి పడిగాపులు కాయాల్సి వస్తుంది.

### ఎన్నారైలకు భరోసా

గతంలో రైతులు ఎవరైనా ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లినా, విదేశాలకు వెళ్లినా.. భూములు వెంటనే అన్యాక్రాంతం అయ్యేవి. దొంగపత్రాలు సృష్టించి వాటిని కబ్జా చేసేవారు. వలస వెళ్లే రైతు కుటుంబాలు వృద్ధులనో, పిల్లలనో ఊళ్లలో ఉంచడానికి గల కారణాల్లో ఇది కూడా ఒకటి. విదేశాలకు వెళ్లాలనుకునే రైతుల పిల్లలైతే భూములు తమ పేర్ల మీద ఉంచుకోవడానికే ఇష్టపడేవారు కాదు. ఊళ్లల్లో భూములున్న ఎన్నారైలు పూటకో గండంగా గడిపేవారు. ఎప్పుడైనా సొంతూరుకు వస్తే సగం రోజులు భూ పంచాయితీలకే సరిపోయేది. ఏండ్లు గడిచినా అవి తెగకపోవడంతో దక్కిందే ప్రాప్తం అన్నట్టుగా అగ్గువకో, సగ్గువకో అమ్ముకొని వెళ్లిపోయేవారు. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత ఆ దుస్థితికి చెక్ పడింది. ఎన్నారైల కోసం ప్రత్యేకంగా పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. పాస్‌పోర్ట్ నంబర్ లేదా వారు స్థిరపడిన దేశంలో ఇచ్చే పౌరసత్వ గుర్తింపు సంఖ్య ఆధారంగా భూముల వివరాలను ధరణిలో నమోదయ్యాయి. ఇప్పుడు ప్రపంచంలో ఏ మూలన ఉన్నా భూ యజమానులు నిబ్బరంగా ఉంటున్నారు. వారికి తెలియకుండా ఆ భూమి క్రయవిక్రయాలు జరిపే అవకాశమే లేకపోవడంతో గుండెమీద చేయి వేసుకొని నిద్రపోతున్నారు. అవసర సమయంలో భూములను అమ్మేందుకు ప్రత్యేకంగా జీపీఏ చేసే అవకాశం కూడా ఉండటంతో భరోసా వచ్చింది. ఒకవేళ ధరణి పోర్టల్ ఎత్తివేస్తే.. రూ.కోట్ల విలువైన భూమిని గాలికి వదిలేసి రైతుల పిల్లలు ఎవరైనా ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాలకో, విదేశాలకో వెళ్లగలుగుతారా? ఒకవేళ వెళ్లినా దళారులు, కబ్జాకోరుల నుంచి భూమిని కాపాడుకోగలరా? వారితో పోరాడి తిరిగి సాధించుకోగలరా? అనేది ఆలోచించాలి.

### రైతును రైతుగా గుర్తించేదెవరు?

ప్రస్తుతం ధరణి వివరాల ఆధారంగా ప్రభుత్వం రైతుబీమా అమలు చేస్తున్నది. ఆన్‌లైన్ రికార్డు ప్రభుత్వంతోపాటు అటు ఎల్ఐసీకి దగ్గర కూడా ఉన్నది. ఒకవేళ దురదృష్టవశాత్తు ఎవరైనా రైతు మరణిస్తే.. వ్యవసాయ శాఖ అధికారికి చెప్పి, డెత్ సర్టిఫికెట్, నామినీ వివరాలు సమర్పిస్తే చాలు.. బీమా చెల్లింపు ప్రక్రియ మొదలైపోతుంది. కంపెనీ నుంచి నేరుగా నామినీ ఖాతాలో బీమా మొత్తం జమ అవుతుంది. ఇలా ఇప్పటివరకు 1,00,782 మంది రైతుల కుటుంబాలకు రూ.5,039 కోట్లు ఆర్థిక సాయం అందింది. ఇందులో ఎక్కడా దళారీలు, పైరవీకారుల ప్రమేయం లేదు. ధరణి పోర్టల్‌ను తీసేస్తే.. సరైన రికార్డు లేదు కాబట్టి బీమా ఇవ్వడానికి ఇన్స్యూరెన్స్ కంపెనీలు ముందుకు రావు. గతంలో మాదిరిగా ఆపద్బంధు వంటి రాబంధు పథకం అమలు చేయాలి. అప్పుడు అధికారులందరికీ లంచాలిస్తూ, ఆరు నెలలపాటు ఆఫీసుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగితే పదో పరకో చేతికి అందుతుంది. ఒకవేళ ఏదైనా బీమా కంపెనీ ముందుకొచ్చినా.. మరణించింది రైతే అని సర్టిఫికెట్ తీసుకోవడమే పెద్ద తతంగం. పంచాయితీ నుంచో, మున్సిపాలిటీ నుంచో డెత్ సర్టిఫికెట్ తీసుకోవాలి. దానికి 'చనిపోయిన వ్యక్తి రైతు' అని ధ్రువీకరించే పత్రాలు రెవెన్యూ, వ్యవసాయ శాఖల నుంచి తేవాలి. ఇందుకోసం ఓ పైరవీకారుడిని పట్టుకోవాలి. ఆ పత్రాలు జోడించి బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఇన్స్యూరెన్స్ కంపెనీ నుంచి ప్రతినిధి వచ్చి వెరిఫికేషన్ చేయాలి. వాళ్లు వచ్చి మరణించిన వ్యక్తి నిజంగా రైతేనా? వారికి వ్యవసాయ భూమి ఉన్నదా? బీమా పరిహారం తీసుకోవడానికి అర్హులేనా? అని పరిశీలించాలి. వారు సేకరించిన వివరాలను పై అధికారి సర్టిఫై చేయాలి. ఆ తర్వాతే బీమా సాయం అందుతుంది. ఈ క్రమంలో డెత్ సర్టిఫికెట్, ఇతర సర్టిఫికెట్ల కోసం అధికారులకు, ఇన్స్యూరెన్స్ ఏజెంట్లకు, చెక్కు వచ్చిన తర్వాత ప్రజాప్రతినిధులకు.. ఇలా అన్ని దశల్లోనూ లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి. చివరికి సగం కన్నా ఎక్కువ సొమ్ము లంచాలకే పోతుంది.



సేవాలాల్ మహరాజ్ చిత్రపటాన్ని తోసేస్తున్న రేవంత్‌రెడ్డి


## సేవాలాల్ మహరాజ్‌కు రేవంత్ అవమానం

### గిరిజనులు చిత్రపటాన్ని బహూకరిస్తుండగా తోసివేత

నారాయణఖేడ్, నవంబర్ 22: ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నారాయణఖేడ్‌లో నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గిరిజనుల ఆరాధ్య గురువు సేవాలాల్ మహరాజ్‌ను దారుణంగా అవమానించారు. రేవంత్ ప్రసంగం ముగిసిన అనంతరం ఆ పార్టీ గిరిజన నాయకులు రేవంత్‌రెడ్డికి సేవాలాల్ మహరాజ్ చిత్రపటాన్ని బహూకరిస్తుండగా తోసేశారు. తమ ఆరాధ్యగురువుపై రేవంత్ తన అగ్రకుల దురహంకారం ప్రదర్శించారని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ 30న బీఆర్ఎస్ బహిరంగ సభ సందర్భంగా సీఎం కేసీఆర్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటాన్ని సగౌరవంగా స్వీకరించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటున్నారు. రేవంత్ గిరిజనులపై తన నిజస్వరూపాన్ని బయట పెట్టుకున్న తీరును జీర్ణించుకోలేకపోతున్నారు. తమ ఆరాధ్యగురువును అవమానపర్చిన రేవంత్‌కు బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నారు.

## కేసీఆర్‌తోనే గిరిజనులకు సాధికారత

- రిజర్వేషన్ల పెంపుతో విద్యాసంస్థల్లో గిరిజన బిడ్డలకు పెరిగిన అడ్మిషన్లు
- సమర్థంగా సబ్‌ప్లాన్ నిధుల వాడకం
- అంతర్జాతీయ గిరిజన విద్యార్థుల జూమ్ మీటింగ్‌లో ఎమ్మెల్సీ కవిత



అంతర్జాతీయ గిరిజన విద్యార్థుల జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సీఎం కేసీఆర్ తోడ్పాటుతోనే గిరిజనులు సాధికారత సాధించారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. రిజర్వేషన్ల పెంపుతో విద్యాసంస్థల్లో గిరిజన బిడ్డలకు అడ్మిషన్లు పెరిగాయని తెలిపారు. 3,300 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. బుధవారం హైదరాబాద్ నుంచి జూమ్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంతర్జాతీయ బంజారా విద్యార్థులతో ఆమె మాట్లాడారు. సబ్‌ప్లాన్ నిధులను సమర్థంగా వినియోగించుకుంటున్న ఏకైక రాష్ట్రం మనదేనని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా పూర్తిస్థాయి నిధులను వినియోగించలేదని గుర్తుచేశారు. గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సీఎం ఎస్టీ ఆంత్రప్రెన్యూర్ కార్యక్రమం అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకం కింద రూ.2 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం రుణం ఇస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణలో గిరిజన జనాభా పెరిగినందున ఎస్టీ రిజర్వేషన్లను పెంచాలని కేంద్రాన్ని తాము విజ్ఞప్తి చేశామని, కేంద్రం పట్టించుకోకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే రిజర్వేషన్లను పెంచిందని గుర్తు చేశారు. తద్వారా మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీల్లో ఎస్టీ విద్యార్థుల ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు.

### ఎస్టీలకు ప్రత్యేక రిజర్వేషన్లు

వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవుల్లో, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో, మెడికల్ షాపుల ఏర్పాటులో కూడా ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించామని కవిత వివరించారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య వసతులను మెరుగుపర్చడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తూనే ఉన్నదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలే కాకుండా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కేసీఆర్ సర్కారు కృషి చేస్తున్నదని, అన్ని సామాజికవర్గాల సాధికారతకు పాటుపడుతున్నామని కవిత చెప్పారు. తెలంగాణ నుంచి అనేక మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదువుకుంటుండటం సంతోషకరమని పేర్కొన్నారు.



ములుగులో బీజేపీ సభాప్రాంగణం నుంచి వెళ్లిపోతున్న ప్రజలు

## ఈటల మీటింగ్‌కు జనం దూరం

**ములుగు:** కాంగ్రెస్‌తోపాటు బీజేపీ సభల్లో కూడా జనం కనిపించడంలేదు. ఆ పార్టీ చెప్పే మాటలు వినడం ఇష్టం లేక ప్రజలు ముఖం చాటేస్తున్నారు. ములుగు జిల్లా కేంద్రంలో బుధవారం బీజేపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్ చేపట్టిన ఎన్నికల సభలో ముఖ్య అతిథిగా హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పాల్గొన్నా.. ఆ సభ జనం లేక వెలవెలబోయింది. ఈటల రాజేందర్ మాట్లాడుతుండగానే జనం ఇంటి దారి పట్టారు. గెలిస్తే ఏంచేస్తామో చెప్పకుండా సీఎం కేసీఆర్‌పై విమర్శలకే ఈటల పరిమితం కావడంతో ప్రజలు లేచివెళ్లిపోయారు. రాజేందర్‌తోపాటు మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు సైతం చెప్పిందే పదే పదే చెప్తూ సభకు వచ్చిన జనాల సహనాన్ని పరీక్షించారు. దీంతో ప్రజలందరూ ఒక్కొక్కరుగా జారుకోవడంతో బీజేపీ సభ తుస్సుమన్నది. అటు కాంగ్రెస్.. ఇటు బీజేపీ.. రెండు జాతీయ పార్టీలను తెలంగాణ ప్రజలు నమ్మడం లేదని బుధవారం నిర్వహించిన సభల సాక్షిగా తేలిపోయింది.